
సాక్షి
బాపట్ల
గురువారం । 10 । ఏప్రిల్ । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 515.60 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 2,053 క్యూసెక్కులు విడుదలవుతోంది.



సదరం క్యాంప్ పునఃప్రారంభం

తెనాలిఅర్బన్: వికలాంగుల ధ్రువపత్రాల పునఃపరిశీలనలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో బుధవారం ప్రత్యేక సదరం క్యాంప్‌ను నిర్వహించారు.



ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం మహంకాళి ఆలయ పునర్నిర్మాణానికి కె.వెంకటమాధవ్, లక్ష్మీప్రియ దంపతులు బుధవారం రూ.1,00,116 విరాళమిచ్చారు.

పేదల నెత్తిన గ్యాస్ బండ



- సిలిండర్‌పై అదనంగా రూ.50 భారం
- బాపట్ల జిల్లాలో మొత్తం కనెక్షన్లు 4.28 లక్షలు
- పెంపు వల్ల అదనపు భారం నెలకు రూ. 2.29 కోట్లు



వేటపాలెం: ముందు రోజు గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసుకున్న వారు కూడా డెలివరీ సమయంలో పెరిగిన మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే నిత్యావసర ధరలు, బియ్యం, కందిప్పు వంటి వాటి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పేద, మధ్యతరగతి ప్రజలు ఈ ధరలతో అవస్థలు పడుతున్నారు. ఈ సమయంలో సామాన్యులకు కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన నిర్ణయం పెనుభారంగా పరిణమించింది. సామాన్యుడు ఏది కొనాలన్నా ఒకటికి పది సార్లు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో అదనపు భారం మోపడంపై ప్రజలు మండిపడుతున్నారు.

గృహ వినియోగానికి సంబంధించిన 14.2 కేజీల సిలిండర్ జిల్లాలో రూ. 844.50 ఉండగా, గ్యాస్ ఏజెన్సీలు అదనంగా రూ. 50 వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. సిలిండర్ ధర రూ. 50 పెంచడంతో రూ. 894.50 సమర్పించాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,58,520 మంది గ్యాస్ కనెక్షన్ కలిగి ఉన్నారు. వీరిలో 3,56,333 మందికి దీపం కనెక్షన్‌లు ఉన్నాయి. వీరు సిలిండర్ రూ. 844.50 చొప్పున కొనుగోలు చేసేందుకు రూ. 38,72,20,140 చెల్లించాల్సి వచ్చేది. ధర పెరిగిన నేపథ్యంలో కొనుగోలు చేస్తే రూ.41,01,46,140 చెల్లించాల్సి ఉంటుంది. వినియోగదారులపై నెలకు సగటున రూ.2,29,26,000 అదనపు భారం పడుతోంది.

పేదలపై మోయలేని భారం

ఇప్పటికే అన్ని వస్తువుల ధరలను కూటమి ప్రభుత్వం పెంచింది. ఇప్పుడు వంట గ్యాస్ ధరలను సైతం కేంద్రం పెంచడం చాలా అన్యాయం. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి. పేద, మధ్య తరగతి ప్రజలను ఆదుకోవాలి.. ఇప్పటికే దినదినగండం అన్నట్లుగా బతుకుతున్న సామాన్య ప్రజలకు కనీస ఊరట కలిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. వారిపై అదనపు భారం తగ్గేలా వెంటనే చర్యలు చేపట్టాలి.

– వసుంధరాదేవి, వేటపాలెం

ధర వెంటనే తగ్గించాలి



రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కరెంటు చార్జీలతోపాటు అనేక వస్తువుల రేట్లు పెరిగేలా వ్యవహరిస్తోంది. డీజిల్, పెట్రోల్ ధరలు కూడా పెరగడంతో ఆ ప్రభావం అన్ని నిత్యావసర వస్తువులపై పడుతోంది. ఈ పరిస్థితుల్లో పేద, మధ్య తరగతి వారు బతకడమే కష్టంగా ఉంది. ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఇలా ధరలు పెంచడం సమంజసం కాదు. పెంచిన వంట గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి.

– జి.సుశీల, పందిళ్లపల్లి

మొక్కజొొన్నకు వాన దెబ్బ



చినపరిమి గ్రామంలో తడిసిన మొక్కజొన్నను ఆరబెట్టుకుంటున్న రైతులు



కొల్లూరు లాక్‌సెంటర్ సమీపంలో నేలవాలిన మొక్కజొన్న పంట

చుండూరు(వేమూరు): గాలులతో కూడిన వర్షం వల్ల మొక్కజొన్న పంట పూర్తిగా నేలవాలింది. పంట ఓదెలు నీటిలో తడిసి పోవడం వల్ల విత్తనాలు బూజుపట్టాయి. వేమూరు నియోజక వర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో జొన్న, మొక్కజొన్న పంటలు సాగు చేశారు. రైతులు మొక్కజొన్న కండెలు విరగదీసే పనుల్లో నిమగ్నమయ్యారు. జొన్న పంట కోసి ఓదెలు వేశారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షాల వల్ల జొన్న పంట దెబ్బతిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కల్లాల్లో ఎండబెట్టిన మొక్కజొన్న తడిసి పోవడంతో ఇబ్బంది పడుతున్నారు. తిరిగి ఆరబెడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు అతివృష్టి, అనావృష్టి వల్ల నష్టం వాటిల్లుతుండటంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల వల్ల తడిసిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

ఈదురు గాలుల ప్రభావం

కొల్లూరు : రబీ పంట చేతికందే సమయంలో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. పంట కోతకొచ్చిన సమయంలో ఇలా నేలవాలడంతో మొక్కజొన్న కండెలు ఇరగదీయడానికి కూలీలకు అదనపు ఖర్చు కానుంది. కండెలు పూర్తి స్థాయిలో విరిచేందుకు ఆస్కారం ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలుల కారణంగా కృష్ణా పరివాహక లంక గ్రామాలలో సాగులో ఉన్న అరటి, తమలపాకు, బొప్పాయి, దొండ వంటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

యువ శాస్త్రవేత్తలుగా ఎంపికైన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ్‌తేజ, డీఈఓ రేణుక, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇస్రో యువికా యువ శాస్త్రవేత్త కార్యక్రమానికి గుంటూరు జిల్లా నుంచి ఎంపికైన విద్యార్థులను జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ అభినందించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో భార్గవ్‌తేజ మాట్లాడుతూ ఇస్రో యువికా యువ శాస్త్రవేత్త కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా 3.50 లక్షల మంది పోటీ పడగా, అందులో కేవలం 350 మంది ఎంపికయ్యారని అన్నారు. వారిలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన 10 మంది విద్యార్థుల్లో గుంటూరు జిల్లాకు చెందిన ముట్లూరు జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి సందు పవన్‌దుర్గ, డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థి వక్కపట్ల సోమశేఖర్ ఉండడం జిల్లాకు గర్వకారణమన్నారు. మే 18 నుంచి 31 వరకు శ్రీహరికోటలోని భారత అంతరిక్ష పరిశోధన కేంద్రంలో జరగనున్న యువికా యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాంలో పాల్గొనున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక, ముట్లూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం జోస్ మేరీ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రేషన్ బియ్యం పట్టివేత



చినగంజాం: మండలంలోని సంతరావూరు గ్రామం నుంచి అద్దంకికి తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఇంకొల్లు పోలీసులు పట్టుకున్నారు. ఇంకొల్లు ఎస్‌ఐ జి. సురేష్ కథనం ప్రకారం చినగంజాం మండలంలోని సంతరావూరు గ్రామం నుంచి అద్దంకికి మినీ లారీలో బుధవారం వేకువ జామున అక్రమంగా తరలిస్తున్న 28 బస్తాల రేషన్ బియ్యాన్ని ముందస్తు సమాచారంతో పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అభయాంజనేయ స్వామి ఆలయానికి విరాళం



పర్చూరు(చినగంజాం): పర్చూరులో వేంచేసియున్న అభయాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో గది నిర్మాణం కోసం దాతలు రూ. 5,25,116 విరాళంగా అందజేశారు. దేవరపల్లి గ్రామానికి చెందిన రావి రంగనాథ బాబు, నాగవర్ధని దంపతులు తమ కుమారుడు రావి శ్రీధర్ జ్ఞాపకార్థం బుధవారం కమిటీ సభ్యులకు ఈ విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కోట హరిబాబు, కటారి సురేంద్రబాబు, రంగిశెట్టి ఆంజనేయులు, తులసి శివనాగేశ్వరరావు, కృష్ణంశెట్టి శ్రీనివాసరావు, నర్రా రామయ్య, రంగిశెట్టి రామాంజనేయులు, మంగళగిరి కోటేశ్వరరావు, ఒగ్గిశెట్టి నరసింహారావు, దాసరి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతుల జాబితాలో ఎస్జీటీలను చేర్చాలి



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయనున్న స్కూల్ అసిస్టెంట్ తెలుగు సబ్జెక్టు సీనియారిటీ జాబితాలో అర్హత కలిగిన ఎస్జీటీలను చేర్చాలని ఏపీటీఎఫ్(1938) జిల్లా ప్రధాన కార్యదర్శి కె. నరసింహారావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం నగరపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాలలో డీఈవో సీవీ రేణుకను కలిసిన ఏపీటీఎఫ్ ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. డిగ్రీలో స్పెషల్ తెలుగు, బీఈడీలో తెలుగు మెథడాలజీ కలిగిన వారిని సైతం సీనియార్టీ జాబితాలో చేర్చాలని కోరారు. డీఈవోను కలిసిన వారిలో ఉపాధ్యాయులు ఉన్నారు.

రూ.5కోట్ల వసూలే లక్ష్యం!

- ఈ ఏడాది ముందస్తు ఆస్తి పన్నుపై అధికారుల కన్ను
- పురపాలక సంఘంలో మూడు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు



నరసరావుపేట: పురపాలకసంఘ పరిధిలో నివాసం ఉంటున్న గృహ, వాణిజ్య సముదాయాల యజమానుల నుంచి రూ.5కోట్ల అడ్వాన్స్‌డ్ ఆస్తిపన్ను వసూలును పురపాలక అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. గతేడాది రూ.3.5కోట్లు మాత్రమే వసూలయింది. ఈ మేరకు పన్నుల సేకరణకు పురపాలక కార్యాలయంలో మూడు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. రెండు వాహనాల ద్వారా పట్టణంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈనెలాఖరు లోపు వచ్చే ఏడాదికి ఆస్తిపన్ను ముందస్తుగా చెల్లించిన వారికి ఐదుశాతం రాయితీని ప్రభుత్వం కల్పించింది. దీంతో పాటు ఈ ఏడాది కూడా యజమానులు 15 శాతం అధికంగా ఆస్తిపన్ను పెంచి చెల్లించాల్సి ఉంటుందని పురపాలక రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కాగా గత మార్చి 31నాటికి ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ.12కోట్ల పన్నులు వసూలు కావాల్సివుండగా అందులో 85శాతం రూ.10.2కోట్లు వసూలైనట్లు పేర్కొన్నారు. మరో రూ.7కోట్లు పెండింగ్ పన్నులు ఉండగా, వాటిలో రూ.1.5కోట్లవరకు వసూలు చేసినట్లు పేర్కొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు సహకరించాలి


కమిషనర్ పులి శ్రీనివాసులు



జంతు ప్రేమికులు, పశు సంవర్ధక శాఖ అధికారులతో సమావేశమైన కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో వీధికుక్కలకు కుటుంబ నియంత్రణ, యాంటీ ర్యాబీస్ వ్యాక్సినేషన్ అవసరమని, అందుకు జంతు ప్రేమికులూ సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అభ్యర్థించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో జంతు ప్రేమికులు, పశుసంవర్ధక శాఖ, నగరపాలక సంస్థ ప్రజారోగ్య శాఖ అధికారులతో ఏబీసీ నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ వీధి కుక్కల కుటుంబ నియంత్రణ, సంక్షేమానికి సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను పాటిస్తామని చెప్పారు. నగరంలో వీధి కుక్కల సమస్యలపై ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయని, ఇటీవల ఇద్యా నగర్‌లో కుక్క దాడిలో ఐజాక్ అనే బాలుడు మృతి చెందడం బాధకరమన్నారు. ప్రస్తుతం నగరంలో పశుసంవర్ధక శాఖ లెక్కల మేరకు 35 వేలకు పైగా వీధి కుక్కలు ఉన్నాయని, వీటికి నగరపాలక సంస్థ ఏటుకూరు రోడ్ లోని ఏబీసీ చేస్తుండగా కొందరు జంతు ప్రేమికుల పేరుతో లేవనెత్తిన ఫిర్యాదుల మేరకు తాత్కాలికంగా నిలిపివేయడం జరిగిందన్నారు. కేంద్ర బృందం పరిశీలన అనంతరం వారి సూచనల ప్రకారం తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏబీసీ ఆపరేషన్లు వెంటనే పునఃప్రారంభం చేయడానికి పశుసంవర్ధక శాఖ నుంచి 5 మంది వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లను నియమించిందన్నారు. స్టేరిలైజేషన్ చేసిన కుక్కలను అదే ప్రాంతంలో వదిలేలా, చేసిన వాటికీ ప్రత్యేక ట్యాగ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. సదరు కార్యకలాపాలను జంతు ప్రేమికులు కూడా నేరుగా పరిశీలించవచ్చన్నారు. అనంతరం జంతు ప్రేమికులు చెప్పిన అంశాలను, ఫిర్యాదులపై కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సమస్య పరిష్కారం చేసుకుంటూ, ఏబీసీ నిర్వహణ చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, పశుసంవర్ధక శాఖ నుండి డాక్టర్ చక్రవర్తి, ఈశ్వరరెడ్డి, జీఎంసీ వీఏఎస్ డాక్టర్ వెంకటేస్వర్లు, జంతు ప్రేమికులు ప్రదీప్ జైన్, తేజోవంత్, రాజ్యలక్ష్మీ, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రజా దర్బార్‌లో రభస



ప్రభుత్వ పథకాలు ఎమ్మెల్యే నసీర్ అమ్మద్‌ను అందడం లేదంటూ నిలదీస్తున్న ప్రజలు

గుంటూరు మెడికల్: గుంటూరు తూర్పు నియోజకవర్గం 15వ డివిజన్ సంగడిగుంట లాంచస్టర్ రోడ్డులో బుధవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. కార్యక్రమానికి ప్రజలను అధిక సంఖ్యలో తరలించే యత్నంలో భాగంగా స్థానిక టీడీపీ నేతలు రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, పెన్షన్లు, ప్రభుత్వ పథకాలు కావాల్సిన వారు కార్యక్రమానికి వస్తే ఇస్తామంటూ ఆటోల్లో ప్రచారం చేశారు. దీంతో స్థానిక ప్రజలు అధిక మొత్తంలో ప్రజా దర్బార్‌కు హాజరయ్యారు. తమ సమస్యలు పరిష్కరించాలని, రేషన్ కార్డులు కావాలని, పెన్షన్‌లు ఇప్పించాలంటూ పలువురు ఎమ్మెల్యేను నిలదీశారు. ఈ సందర్భంగా కొద్దిసేపు గందరగోళం నెలకొంది. రేషన్ కార్డులు మంజూరుకు ఇంకా ప్రభుత్వం నుంచి అనుమతి రాలేదని, అనుమతి రాగానే అందరికీ పథకాలు ఇప్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో సమస్య సద్దు మణిగింది. అధిక మొత్తంలో ప్రజలు పథకాల కోసం హాజరవడంతో జనాల మధ్య తోపులాట, వాగ్వాదం జరిగి రభస చోటు చేసుకుంది.

స్త్రీనిధి రుణలక్ష్యం రూ.150కోట్లు

డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి



నరసరావుపేట రూరల్: స్వయం సహాయక సంఘాల మహిళలకు 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.150 కోట్లు రుణాలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.ఝాన్సీరాణి తెలిపారు. కోటప్పకొండలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఝాన్సీరాణి మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి రుణాల లక్ష్యం రూ.120కోట్లు కాగా రూ.47కోట్లు రుణాలు మాత్రమే అందించినట్టు తెలిపారు. స్త్రీనిధి రుణాలు అందించడంలో బెల్లంకొండ, శావల్యాపురం, చిలకలూరిపేట, నకరికల్లు, రొంపిచర్ల, నాదెండ్ల, ముప్పాళ్ల, రాజుపాలెం, సత్తెనపల్లి, నూజెండ్ల మండలాలు ముందు వరుసలో ఉన్నాయన్నారు. మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించేందుకు అవసరమైన జీవనోపాధి రుణాలను స్వల్పకాలిక, మైక్రో, ట్రైనీగా వర్గీకరణ చేసి అందిస్తున్నట్టు తెలిపారు.

బీచ్‌ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



గర్భిణులకు సీమంతం చేస్తున్న జిల్లా కలెక్టర్

బాపట్ల: సూర్యలంక, రామాపురం బీచ్‌లను జులై నెలలోగా మెరుగైన పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. పర్యాటక శాఖ అధికారులు, కన్సల్టెంట్‌లతో బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లా పర్యాటకంగా మరింత కీలక ప్రాంతం కానుందని చెప్పారు. జులై నెల నాటికి బోటింగ్ షికార్ అందుబాటులోకి తెచ్చే ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. పర్యావరణ కాలుష్యం లేని ప్రాంతంగా ఈ రెండు బీచ్‌లను ప్రాథమికంగా గుర్తించినట్లు చెప్పారు. ఇప్పటికే 20 మంది శాస్త్రవేత్తలు ఆ రెండు బీచ్‌లలో అధ్యయనం చేశారని వివరించారు. రాజస్థాన్, గుజరాత్ తరహాలో తీర్చిదిద్దడానికి అడుగులు వేస్తున్నామన్నారు. జిల్లాలో జీడిపప్పు ఉత్పత్తి అధికంగా ఉన్నందున విక్రయాలు, ప్రదర్శనలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. తాటిచెట్ల ఆధారంగా ఉత్పత్తులు పెంచేలా కల్లు గీత కార్మికులకు, బోటింగ్ షికారు జరిగేలా మత్స్యకారులకు కల్లరి శిక్షణ ఇవ్వాలన్నారు. చేనేత ఉత్పత్తుల పెంపు, ప్రదర్శనలకు చర్యలు తీసుకుంటామన్నారు. వాడరేవు వద్ద రెవెన్యూ అసోసియేషన్‌కు సంబంధించిన ఎకరా భూమిని ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తామన్నారు. లేదంటే ఏజెన్సీలకు ఆ భూమిని లీజ్‌కు ఇవ్వడానికి పరిశీలిస్తామన్నారు. పేరలి కెనాల్ బోటింగ్‌కు అనువైన ప్రాంతం కాగా, పర్యాటకుల కోసం సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. బీచ్‌ల వద్ద రిసార్ట్స్ నిర్వహణపై రూపొందించిన నివేదికలపై ఆయన చర్చించారు. అత్యవసర అభివృద్ధి పనులకు రూ.1.13 కోట్ల నిధులతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, పర్యాటక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నాయుడు, కన్సల్టెంట్ సాహితీ దివి, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా శిశు సంక్షేమానికి పథకాలు

బాపట్ల: మహిళా శిశు సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. బుధవారం స్థానిక సాయిరామ్ గార్డెన్ కన్వెన్షన్ హాల్‌లో జిల్లా స్థాయి పోషణ్ పక్వాడ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గర్భిణులకు అవగాహన కల్పించారు. అనాథ శిశువుల కోసం రైల్వే స్టేషన్లో, బస్టాండ్‌లో ఊయలలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో సఖి వన్ స్టాప్ సెంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. బాపట్ల శాసనసభ్యు వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. 20 మంది గర్భిణులకు వేగేశన ఫౌండేషన్ ద్వారా రూ.5 వేల వంతున ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధా మాధవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్‌ఈ అనంతరాజు, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితాలు బలి చేసుకోవద్దు

ఈగల్ టీమ్ ఎస్పీ నగేష్





ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈగల్ టీమ్ ఎస్పీ కె నగేష్ బాబు, పక్కన వీసీ ఆచార్య కె గంగాధరరావు తదితరులు

ఏఎన్‌యూ(గుంటూరు): డ్రగ్స్‌తో జీవితాలు బలి చేసుకోవద్దని యువతకు పోలీస్ విభాగ ఈగల్ టీమ్ ఎస్పీ కె.నగేష్ సూచించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహిస్తున్న ఏఎన్‌యూ మహోత్సవ్ 2కె25 కార్యక్రమంలో భాగంగా బుధవారం యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద 'ఎరాడికేషన్ ఆన్ డ్రగ్స్' అనే అంశంపై విద్యార్థులు ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నగేష్ బాబు మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల తలెత్తే దుష్పరిణామాలను వివరించారు. విశ్వవిద్యాలయాల్లో డ్రగ్స్ నిర్మూలనకు ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వీసీ ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ జోలికి పోరాదని సూచించారు. ఈగల్ ఎస్పీతో కలిసి వర్సిటీ అధికారులు, విద్యార్థులు అధ్యాపకులు డ్రగ్స్ ఎరాడికేషన్‌పై ప్రతిజ్ఞ చేశారు. డ్రగ్స్ వల్ల తలెత్తే దుష్పరిణామలపై స్కిట్ ప్రదర్శించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలం, రెక్టార్ ఆచార్య రత్నషీలా మణి, ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డి. చంద్రమౌళి, కన్వీనర్ డాక్టర్ సిహెచ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళలకు అండగా శక్తి యాప్



బాపట్ల టౌన్: శక్తి యాప్ వినియోగంపై మహిళలు, విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. బుధవారం జిల్లాలోని పలు చోట్ల యాప్‌పై పోలీసులు అవగాహన కల్పించారు. మహిళలు, విద్యార్థినులు ఒంటరిగా ప్రయాణించే సందర్భంలో సేఫ్ ట్రావెల్ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

మిర్చివ్యాపారి అదృశ్యంపై కేసు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడుకు చెందిన ఓ మిర్చి వ్యాపారి అదృశ్యమైన ఘటన కలకలం రేపుతోంది. సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు, అబ్బూరు, ఫిరంగిపురం మండలం 113త్యాళ్లూరు, యర్రగుంట్లపాడు తదితర గ్రామాల్లో రైతుల అంగీకారంతో మిర్చి వ్యాపారి తిరుములరావు ఏటా మిర్చి తూకాలు వేసి, వాహనాల్లో లోడు చేసుకుని తరలించేవాడు. గుంటూరులో బడా వ్యాపారులకు విక్రయించి రైతులకు నగదు చెల్లించేవారు. ప్రస్తుత సీజనులో సుమారు 50 మంది రైతుల నుంచి సుమారు రూ. 2 కోట్ల విలువైన మిర్చి సేకరించి గుంటూరులోని ఓ గోదాములో నిల్వ చేశారని, సోదరుడి సహాయంతో కొన్ని దుకాణాలకు నమూనాలు పంపి విక్రయించారని రైతులు ఆరోపిస్తున్నారు. నగదు కోసం రైతులు వ్యాపారి ఇంటికి వెళితే సుమారు పది రోజులుగా కనిపించడం లేదని చెబుతున్నారన్నారు. ఈ క్రమంలో లక్కరాజుగార్లపాడుకు చెందిన కొందరు రైతులు సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పది క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

తాళ్ళయపాలెం(తాడికొండ): అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసిన ఘటన తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం తాళ్ళాయపాలెం గ్రామంలో నల్లబజారుకు తరలించేందుకు 20 సంచుల్లో సిద్ధంగా ఉంచిన 10 కిలోల రేషన్ బియ్యాన్ని మంగళవారం అర్ధరాత్రి పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. ఎస్ఐ బాబురావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడులలో రేషన్ బియ్యంతో పాటు వాటిని తరలిస్తున్న ఉగ్గం అజయ్ కుమార్, మొగిలి వెంకట్రావులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తుళ్ళూరు ఎస్ఐ బాబురావు తెలిపారు.

రంగస్థలంపై స్త్రీ కాంతులు

- చింతామణిలో శ్రీహరి పాత్రతో మన్ననలు
- తాత స్ఫూర్తితో చిన్ననాటి నుంచే ప్రతిభ
- ఇప్పటివరకు 4,500కుపైగా ప్రదర్శనలు
- రెండు లఘుచిత్రాలతో మరింత గుర్తింపు
- నటనలో యువకుడు శ్రీకాంత్ సత్తా

అద్దంకిలో కళాకారులకు కొదువలేదు. బండారు రామారావు, అద్దంకి మాణిక్యాలరావు నాడు రంగస్థలంపై తమ నటనతో అలరించారు. నేటి తరం నటులు ఎందరో ఉన్నారు. ఆ కోవలో తన తాత అద్దంకి మాణిక్యాలరావును స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతున్నారు శ్రీకాంత్. చింతామణిలో స్త్రీ పాత్రయిన శ్రీహరిగా ప్రతిభ చాటుతున్నారు. – అద్దంకి

పట్టణంలోని నంబూరిపాలెంకు చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, జెమినీ సంస్థలో పనిచేసిన అద్దంకి మాణిక్యాలరావు మనవడు శ్రీకాంత్. ఆయన తండ్రి పేరు హనుమంతరావు. ఈయన కూడా నటుడే. తల్లి మేరీ భారతి. శ్రీకాంత్ తన నాలుగో ఏటే సత్య హరిశ్చంద్ర నాటకంలో లోహితాసుడు వేషం ధరించారు. చింతామణి నాటకంలోని శ్రీహరిగా, సత్య హరిశ్చంద్రలో హరిశ్చంద్రుడు, విశ్వామిత్రుడు, కాలకౌశకుడు, వీరబాహు, లక్ష్మి తిరుపతమ్మ నాటకంలో భృగుమహర్షి, తిప్పడు, బ్రాహ్మణుడు, మలయ్య, వెంగమాంబ తదితర పాత్రలు పోషించారు. పౌరాణిక, జానపద నాటకాలే కాకుండా



'బాలనాగమ్మ' నాటకంలో మాయల ఫకీర్



'చింతామణి' నాటకంలో శ్రీహరిగా....

శిలువధారి, శాంసన్ డెలీల, బ్రహ్మం గారి నాటకాలలోనూ ప్రతిభ చూపారు.



ప్రదర్శనలు..

ఇప్పటివరకు 4,500కుపైగా ప్రదర్శనలు ఇవ్వడం విశేషం. రెండు లఘు చిత్రాలలో నటించి మరింత గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యమైన ఆంధ్రా యూనివర్సిటీ – విశాఖపట్నం, కాలికట్ యూనివర్సిటీ – కేరళ, బళ్లారి రాఘవ కళాక్షేత్రం – కర్నాటక, రవీంద్రభారతి – హైదారబాద్, విజయవాడలోని తుమ్మపల్లి కళాక్షేత్రం వంటి వేదికలపై తన ప్రదర్శనలతో పేరొందారు. ప్రముఖ రంగస్థల నటుడు చీమకుర్తి నాగేశ్వరరావు, విజయ్‌రాజు, తన తల్లి మేరీ భారతితో కలిసి నటించారు.

ఎన్నో సత్కారాలు

శ్రీకాంత్ ఇప్పటివరకు దాదాపు 500కుపైగా సన్మానాలు అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అప్పటి మంత్రి పార్థసారథిచే ప్రముఖ రంగస్థల నుడు రేబాల రమణ పురస్కారం, నాటక కిశోర బిరుదు, తమిళనాడులోని తిరువణ్ణామలైలో అక్కడి కలెక్టర్ నుంచి సన్మానం పొందారు. సినీ రచయిత, నటుడు తనికెళ్ల భరణితో హైదరాబాద్‌లో జరిగిన



కార్యక్రమంలో ప్రశంసలు అందుకున్నారు. గానగంధర్వ, అభినవ శ్రీహరి, రంగస్థల సకల పాత్ర వల్లభుడు అనే బిరుదులు పొందారు.

ఉన్నత పాఠశాల పునః ప్రారంభానికి చర్యలు

కారంచేడు: యార్లగడ్డ నాయుడమ్మ ఓరియంటల్ (కం) ఉన్నత పాఠశాలను ఈ విద్యా సంవత్సరం నుంచి పునః ప్రారంభిస్తున్నామని గుంటూరు ఆర్‌జేడీ బీ లింగేశ్వరరెడ్డి అన్నారు. కారంచేడు గ్రామంలో విద్యాదాతలు యార్లగడ్డ వెంకన్న చౌదరి, యార్లగడ్డ రంగనాయకులు చౌదరిలచే 1956లో చల్లపల్లి రాజా చేతుల మీదగా దీనిని ప్రారంభించారు. బుధవారం బాపట్ల డీఈఓ ఎస్ పురుషోత్తంతో కలిసి ఆర్‌జేడీ పాఠశాల స్థితిగతులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన పాఠశాల కరస్పాండెంట్ యార్లగడ్డ రఘుబాబు దీనిపై రాష్ట్ర పాఠశాలల విద్యా కమిషనర్ విజయరామరాజును కలిసి విన్నవించారన్నారు. ఉన్నత పాఠశాలను పునః ప్రారంభించాలని కోరారన్నారు. విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు 2025–26 సంవత్సరాలకు సంబంధించి జూన్ 12వ తేదీ నుంచి ఇక్కడ తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఏడాది 6 నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లిషు మీడియంలో విద్యా బోధన ఉంటుందని చెప్పారు. మాజీ ఎంపీపీ యార్లగడ్డ రాఘవయ్య మాట్లాడుతూ అవసరమైన సహకారం అందిస్తామన్నారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను కూడా ఆర్‌జేడీ పరిశీలించారు. ఈ పాఠశాలను మోడల్ స్కూల్‌గా అభివృద్ధి చేస్తామని బాపట్ల డీఈఓ ఎస్ పురుషోత్తం తెలిపారు. అందుకు అవసరమైన అదనపు తరగతి గదులను పాఠశాలకు అప్పగించాలని ఆయన గ్రామ సర్పంచ్ బాలిగ శివపార్వతిని కోరారు. కార్యక్రమంలో చీరాల డిప్యూటీ ఈఓ జి. గంగాధర్, ఎంఈఓలు ఎం.వి. సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



కారంచేడులో పాఠశాలను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ బి.లింగేశ్వరరెడ్డి

మోడల్స్ స్కూళ్లుగా పాఠశాలలు

కారంచేడు: రాష్ట్ర వ్యాప్తంగా పలు పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా విస్తరించేలా ఏర్పాట్లు చేస్తున్నామని, అందుకు తగిన పాఠశాలల ఎంపికను పటిష్టంగా జరపాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు సూచించారు. బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గుంటూరు రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) బి. లింగేశ్వరరెడ్డి పాల్గొన్నారు. బుధవారం ఆయన కారంచేడు గ్రామంలోని వైఎన్ఓ ఉన్నత పాఠశాలను పరిశీలించేందుకు వచ్చిన అనంతరం ఎమ్మార్సీలో వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. గుంటూరు ఆర్‌జేడీ కార్యాలయ పరిధిలోని గ్రామాల్లో ఎంపిక చేయబోతున్న పాఠశాలలను పరిశీలించాలని సూచించారు. విద్యాశాఖ కమిషనర్ సూచనలు, సలహాలను ఆర్‌జేడీ నమోదు చేసుకున్నారు. ఆయన వెంట బాపట్ల డీఈఓ ఎస్ పురుషోత్తం ఉన్నారు.

గ్యాస్ ధరలు పెంచడం దుర్మార్గం

నిరసన వ్యక్తం చేసిన సీపీఎం నాయకులు

నరసరావుపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన వంట గ్యాస్ రూ.50, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. ఆంజనేయులునాయక్ డిమాండ్ చేశారు. పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్టేషన్ రోడ్డులోని గాంధీ పార్క్ వద్ద గ్యాస్ సిలిండర్లతో నిరసన తెలిపారు. ఆంజనేయనాయక్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు బీజేపీ నేతలు సిలిండర్‌పై రూ.200, పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గిస్తామని ఓట్లు వేయించుకొని మూడవసారి అధికారం చేపట్టి, అనంతరం ఇచ్చిన మాట తప్పారన్నారు. దశల వారీగా గ్యాస్ ధరలు పెంచుతూ రాయితీలు ఎత్తివేశారని విమర్శించారు. బడా పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేస్తున్న నరేంద్రమోదీ గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన



స్టేషన్‌రోడ్డు గాంధీపార్కు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కూటమి ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత గ్యాస్ అంటూ ఊదరగొట్టినా అనేక షరతులు విధిస్తోందన్నారు. దీంతో ఉచిత గ్యాస్ అందకుండా పోతుందన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి, టి.పెద్దిరాజు, నాయకులు కామినేని రామారావు, సయ్యద్ రబ్బాని, షేక్ మస్తాన్‌వలీ, డి.సుభాష్‌చంద్రబోస్, షేక్ ఖాసీం, మిరపకాయల రాంబాబు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకం .. కేఎస్ సామాజిక దృక్పథం

పట్నంబజారు: సామాజిక స్ఫూర్తితో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు ప్రజా సంఘాలు, పలువురు మేధావులు, విద్యార్థి, యువజన సంఘాల నేతలు కలిసి బుధవారం బృందావన్ గార్డెన్స్‌లోని స్ఫూర్తి ఫౌండేషన్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు సత్కార సభ నిర్వహించారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ అధ్యాపకుడిగా వేలాది మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన విద్యావేత్త.. అనేక కాంపిటీటివ్ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం ద్వారా ఎందరో నిరుద్యోగులకు ఉజ్వల భవిష్యత్తు అందించిన మేధావిగా కొనియాడారు. ప్రజా సమస్యలపై రాజీ లేని పోరాటం చేసిన సామాజిక ఉద్యమకారుడు అని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల



లక్ష్మణరావును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి తదితర నేతలు

అజయ్‌కుమార్ మాట్లాడుతూ నిరాడంబరత, సమయపాలనకు ఆయన పెట్టింది పేరని, సామాజిక ఉద్యమకారుడిగా ఆయన చేసిన కృషిని వీడియోల రూపంలో భద్రపరిస్తే భావితరాలకు అది ఉపయుక్తంగా ఉంటుందన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు వి.లక్ష్మణరెడ్డి, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆయన సేవలను కొనియాడారు. స్పందించిన కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వామపక్ష భావాలతో ముందుకు సాగుతూ సమస్యలపై పోరాడేందుకు ముందు నిలబడడం తనకు అలవాటుగా మారిందని వివరించారు. ఈ క్రమంలోనే గుంటూరులో జరిగిన అన్ని ప్రజోపయోగ పోరాటాల్లో తన వంతు పాత్ర పోషించినట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి, స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి గోరంట్ల వెంకట్రావు, నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపకులు ధనుంజయరెడ్డి, సీపీఎం నేత భారవి, విశ్రాంత ప్రధాన అధ్యాపకులు డీఏఆర్ సుబ్రహ్మణ్యం, ముత్యం పాల్గొన్నారు.

యార్డులో 1,35,382 బస్తాలు మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,31,198 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,35,382 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.13,800 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,400 వరకు ధర లభించింది. తాలు రకం



మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 62,733 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

పీహెచ్‌సీలలో డీఎంహెచ్‌ఓ తనిఖీలు



మాదిపాడు పీహెచ్‌సీలో వ్యాక్సిన్‌లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి

అచ్చంపేట(క్రోసూరు): పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రవి అచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. మాదిపాడు పీహెచ్‌సీ పరిధిలోని చింతపల్లి, మాదిపాడు సబ్ సెంటర్స్‌లో జరిగే సాధారణ ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని తనిఖీ చేసారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందికి డీఎంహెచ్‌ఓ పలు సూచనలు చేశారు. చిన్న పిల్లల వాక్సినేషన్‌ను వేసవి దృష్ట్యా ఉదయం 11 గంటల లోపు ముగించాలని తెలిపారు. అనంతరం పీహెచ్‌సీ కార్యకలాపాలపై వైద్యాధికారి డాక్టర్ ఎం.ఇన్నారావును అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో జిల్లా ప్రోగ్రామ్ నోడల్ అధికారి డాక్టర్ డి.హనుమకుమార్ పాల్గొన్నారు. అచ్చంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ స్రవంతి, మాదిపాడు సీహెచ్‌ఓ హర్ష వర్ధన్, శివ నాగేశ్వరి, ఆరోగ్య విస్తరణ అధికారి పి.వెంకటరావు, హెల్త్ ఎడ్యుకేటర్ పార్వతి, సూపర్‌వైజర్ పి.రాధాకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

జిల్లా వైద్యశాలలో పర్యటించిన కాయకల్ప బృందం



తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో బుధవారం కాయకల్ప బృందం పర్యటించింది. మంగళగిరిలోని నేషనల్ హెల్త్ మిషన్ అధికారులు డాక్టర్ నిర్మలగ్లోరి, డాక్టర్ స్టెఫిగ్రేస్‌లు తల్లీపిల్లల వైద్యశాలలోని పలు వార్డులు, ఆపరేషన్ థియేటర్, జిల్లా వైద్యశాలలోని పలు వార్డులు, ల్యాబ్‌లను పరిశీలించి అక్కడ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. డాక్టర్ నిర్మల గ్లోరి మాట్లాడుతూ కాయకల్ప కార్యక్రమంలో భాగంగా తెనాలి రావటం జరిగిందన్నారు. ఆస్పత్రిలో నిబంధనలకు అనుగుణంగా రోగులకు సేవలు అందింస్తున్నారా లేదా అనేది పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఆస్పత్రిలో శానిటేషన్ బాగోకపోతే ఇన్‌స్పెక్షన్ సోకే అవకాశం ఉంటుందన్నారు. దానిపై ప్రత్యేక పరిశీలన జరుపుతున్నట్లు వివరించారు. జిల్లా వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. వారి వెంట వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజేశ్వరి ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

కర్లపాలెం: ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి తగ్గి ఆదాయం పెరుగుతుందని కమ్యూనిటీ నేచురల్ ఫామింగ్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరక్టర్ జె.మోహన్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ, అనుబంధ శాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు. మోహన్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వలన నాణ్యమైన ఆహార ఉత్పత్తులను పండించవచ్చునని చెప్పారు. వీటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని తెలిపారు. వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మి మాట్లాడుతూ సెర్ప్, కమ్యూనిటీ నేచురల్ ఫామింగ్, వ్యవసాయ శాఖల సమన్వయంతో ఖరీఫ్ సాగుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. ఏపీఎం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ డ్వాక్రా సీసీలు, యానిమేటర్లు ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ ఉత్తమ రైతులు బొమ్మిశెట్టి చలపతి శ్రీనివాస్, పిట్టు రామకృష్ణారెడ్డిలకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, ఏవో సుమంత్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు, నేచురల్ ఫామింగ్ సిబ్బంది, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపి కౌన్సిల్ ఏర్పాటు చేయండి

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్‌లో ఫిజియోథెరఫిస్ట్స్ ప్రొఫెషన్ కౌన్సిల్ సభ్యులను తక్షణమే నియమించాలని ఆంధ్రప్రదేశ్ ఫిజియోథెరఫిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బాపట్ల వేంకటహరికృష్ణ కోరారు. ఈమేరకు విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలైడ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ వై.వెంకటేశ్వరరావు, సెక్రటరీ డాక్టర్ సుమైలను కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఫిజియోథెరఫిస్ట్స్ ప్రొఫెషన్ కౌన్సిల్ ప్రత్యేక సభ్యులను నియమించేందుకు గజిట్ విడుదల చేసినట్లు తెలిపారు. నాటి గజిట్ ఆధారంగా కౌన్సిల్ ఏర్పాటు చేస్తే తమ సమస్యలు పరిష్కరించేందుకు తమకు అవకాశం కలుగుతోందన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ షేక్ సుభాని, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ చెవుల ఏడుకొండలు, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ గ్రేస్, డాక్టర్ ఇమ్రాన్‌ఖాన్, డాక్టర్ రాజేష్ రోషన్, డాక్టర్ మురళీధర్, డాక్టర్ దయాకర్ తదితరులు ఉన్నారు. తొలుత నూతనంగా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ వెంకటేశ్వరరావును ఫిజియోథెరఫిస్ట్స్ అసోసియేషన్ నేతలు బొకే అందజేసి సత్కరించారు.



డాక్టర్ వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న ఫిజియోథెరపిస్ట్ సంఘం నేతలు

మనోళ్లే ఆర్పీగా పెట్టుకోండి

- ఎమ్మెల్యే సిఫార్సు లేఖ
- నియమించిన మెప్మా సిబ్బంది



రామిరెడ్డితోటలోని మున్సిపల్ స్కూల్‌లో సమావేశమైన గ్రూపు సభ్యులు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): 'మనోళ్లే.. నేను చెప్తున్న కదా.. ఆ అమ్మాయిని రిసోర్స్ పర్సన్(ఆర్పీ)గా పెట్టుకోవాలి' అంటూ తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ హుకుం జారీ చేశారు. ఎమ్మెల్యే సిఫార్సు లేఖ ఇవ్వడంతో మెప్మా సీఎంఎం పావని, సీఓ సరోజిని కొత్తగా ఓ ఆర్పీని నియమించారు. అంతేగాక ఆమెకు వేరే ఆర్పీ వద్ద నుంచి 22 గ్రూపులను తీసుకుని కేటాయించారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా సీఎంఎంలు(సిటీ మిషన్ మేనేజర్), సీఓలు(కమ్యూనిటీ ఆర్గనైజర్)ల కంటే ఆర్పీలు ఎక్కువగా ఉన్నారని.. వీరికి జీతాలు చెల్లించేందుకు కూడా అవస్థలు పడాల్సిన దుస్థితి ఉందని, కొత్తవారిని తీసుకోవద్దని మెప్మా ఎండీ స్పష్టంగా ఆదేశించినా సిబ్బంది పెడచెవిన పెట్టారు. ఎమ్మెల్యే లేటర్ ఇచ్చారని కొత్త ఆర్పీని నియమించారు. బుధవారం రామిరెడ్డితోటలోని బంగ్లా మున్సిపల్ స్కూల్‌లో సమావేశమై కొత్త ఆర్పీని గ్రూపు సభ్యులకు పరిచయం చేశారు.

లాగిన్ ఇవ్వడం లేదు

కొత్త ఆర్పీ కోసం సమైక్యలో గ్రూపు సభ్యులంతా కలిసి తీర్మానం చేసుకున్నారు. ఆ తీర్మానం మేరకే కొత్త ఆర్పీని నియమించాం. కానీ లాగిన్ ఇవ్వడం లేదు. ప్రస్తుతం వేరే ఆర్పీల వద్ద ఉన్న గ్రూపుల నుంచి 22 గ్రూపులను కొత్త ఆర్పీకి కేటాయించాం. – పావని, సీఎంఎం

అటల్ టింకరింగ్ ల్యాబ్ పరిశీలన

పెదకూరపాడు: 75త్యాళ్ళూరు జిల్లా పరిషత్ హైస్కూల్లోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను రాష్ట్ర బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించి, విద్యార్థులతో సంభాషించి, వారు చేస్తున్న ప్రాజెక్టులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ స్టేట్ ఆఫీసర్, యునిసెఫ్ కన్సల్టెంట్ సుదర్శన్ మాట్లాడుతూ రానున్న కాలం అంతా రోబోటిక్, డిజిటల్ టెక్నాలజీదేనని, విద్యార్థులు నూతన టెక్నాలజీని ఉపయోగించి తాము తయారుచేసిన నమూనాలకు స్టార్టప్ ప్రోగ్రాం కింద ప్రోత్సాహక నగదు, పేటెంట్ పొందవచ్చన్నారు. ఇన్నోవేటివ్ స్పిరిట్‌తో విద్యార్థులు ముందడుగు వేయాలని అన్నారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ రాజశేఖర్ మాట్లాడుతూ భవిష్యత్తులో వినూత్నతనమైన ప్రాజెక్టులను తయారు చేయడానికి విద్యార్థులు సృజనాత్మకతతో ఆలోచించాలన్నారు. హెచ్‌ఎం ఎ.శ్రీనివాస రెడ్డి, అటల్ ల్యాబ్ ఇన్‌చార్జి కె.వి.సుబ్బారావు, ఈఆర్‌డీసీకి చెందిన అమర్, మెంటర్ సుస్మిత, సీఆర్పీ శివ, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం సభ్యులు

తలసేమియా ట్రాన్స్‌ఫ్యూజన్ సెంటర్‌కు స్థలం కేటాయించండి

కలెక్టర్‌ను కోరిన రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యులు

నరసరావుపేట: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 'మీ డాక్టర్ మీ ఇంటికి' అనే ప్రాజెక్టు దేశం మొత్తంలో 33 జిల్లాలకు మంజూరు కాగా అందులో పల్నాడు జిల్లా ఒకటని రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.అరుణ్‌బాబును కలిసి రెడ్‌క్రాస్ జిల్లా కార్యకలాపాలను గురించి వివరించారు. ఈ ప్రాజెక్టును త్వరలో ప్రారంభించి జిల్లాలో ఉన్న గిరిజన తండాలు, మత్స్యకారులకు వారి ఇంటి వద్దకే వెళ్లి వైద్యాన్ని అందజేస్తామని తెలియజేశారు. అలాగే జిల్లాకు రెడ్ క్రాస్ ద్వారా తలసేమియా ట్రాన్స్‌ఫ్యూజన్ సెంటర్ మంజూరైందని, సుమారు రూ.6లక్షల విలువ చేసే సామగ్రి కూడా మంజూరు చేశారని, ఈ సెంటర్ ఏర్పాటు కోసం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో 10 పడకల స్థలాన్ని మంజూరు చేయాల్సిందిగా కలెక్టర్ కోరారు. ఆర్డీఓ కాంపౌండ్‌లో ఉన్న 15 సెంట్ల రెడ్‌క్రాస్ స్థలాన్ని సర్వే చేయించి రెడ్‌క్రాస్‌కు కేటాయిస్తే అందులో నూతన భవన నిర్మాణం చేసి ఓల్డ్ ఏజ్ హోమ్, స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్, ఉచిత వైద్యశాల, అనాథ శరణాలయం, జనరిక్ మెడికల్ షాప్ ఏర్పాటు చేస్తామన్నారు. దీనికి జిల్లా కలెక్టర్ సుముఖత వ్యక్తం చేసినట్లు డాక్టర్ కంజుల తెలిపారు. రెడ్‌క్రాస్ జిల్లా ఉపాధ్యక్షులు, మేనేజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కలెక్టర్ అరుణ్‌బాబును కలిసిన రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తాడేపల్లి రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. తాడేపల్లి ముగ్గురోడ్డుకు చెందిన బూదాల దాస్ (43) మంగళగిరి విజయవాడ పాత జాతీయ రహదారిపై ద్విచక్రవాహనంపై వస్తుండగా ప్రకాష్‌నగర్ వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో దాస్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ దాస్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న తాడేపల్లి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

